క్లుప్తంగా

ఘనంగా తిలక్, చంద్రశేఖర్ జయంతి



తిలక్, చంద్రశేఖర్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న ఇన్‌చార్జి వీసీ, అధ్యాపకులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ మహనీయుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, దేశ ప్రగతికి ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెయిన్ కోట్‌ల పంపిణీ



ఊలపల్లిలో కార్మికులకు రెయిన్‌కోట్‌లు అందజేసిన నాయకులు

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి పంచాయతీలో సర్పంచ్ బండారు రమ్య, బిక్కవోలు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ తొండాపు సురేష్‌రెడ్డి కార్మికులకు మంగళవారం రెయిన్ కోట్‌లు అందజేశారు. రెయిన్ కోట్‌లను ఎంపీటీసీ బండారు శివ సమకూర్చారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గేదెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల వితరణ



దాత అందించిన క్రీడా పరికరాలతో ఉపాధ్యాయులు

మధురపూడి: కోరుకొండ మండలం జగన్నాథపురం హైస్కూల్‌కు మంగళవారం క్రీడా పరికరాలను వితరణ చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ పసుమర్తి వెంకట సునీల్ రూ. రూ.46,200 విలువైన ఈ పరికరాలను హెచ్‌ఎం యు.గంగాభవాని ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. 8 వాలీబాల్స్, 2 ఫుట్ బాల్స్, పది షటిల్ రాకెట్లు, 10 బాల్ బ్యాడ్మింటన్ రాకెట్లు, 2 కోక్ బేరల్స్, 60 నెట్స్, వుడ్ డంబుల్స్ ఇచ్చారు.

గైట్‌లో చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

రాజానగరం: స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల గ్రంథాలయంలో ప్రకృతి సంరక్షణపై విద్యార్థులకు మంగళవారం పోటీలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మేరీ లైఫ్‌లో భాగంగా పర్యావరణ హితజీవనశైలిపై అవగాహన కలిగించే విధంగా ఈ పోటీలు నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ తెలిపారు. పర్యావరణ పరిక్షణ వలన కలిగే ప్రయోజనాలు, లేకుంటే ఎదురయ్యే అనర్థాలను తెలియజేస్తూ విద్యార్థులు పలు చిత్రాలను గీశారన్నారు. పి.సింధు ప్రథమ, కె.షామిని ద్వితీయ, ఎస్.ఉమ తృతీయ బహుమతులు సాధించారని తెలిపారు. డాక్టర్ సి.గౌరీ న్యాయనిర్ణేతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

వెన్నెముక బాధితుడికి వీల్‌చైర్ వితరణ



బాధితుడికి వీల్‌చైర్ అందజేస్తున్న డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ, చిత్రంలో దాతలు కల్యాణి, భీమేశ్వరరావు

కంబాలచెరువు: వెన్నెముక విరిగిపోయి రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సిద్ధ శ్రీనివాస్‌కు ఆస్పత్రి ఉద్యోగులు తమ సొంతఖర్చుతో వీల్‌చైర్ కొనుగోలు చేసి అందజేశారు. రాజానగరం మండలం పరిజల్లిపేట గ్రామానికి చెందిన 25 ఏళ్ల సిద్ధ శ్రీనివాస్ ఐదు నెలల క్రితం ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రమాదానికి గురయ్యాడు. అప్పులు చేసి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వెన్నెముకకు శస్త్రచికిత్స చేయించుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో మంచానికే పరిమితం కావడంతో శరీరం వెనుక భాగం కుళ్లిపోయి తీవ్రగాయమైంది. చర్మం ముక్కలుగా ఊడిపోవడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. శ్రీనివాస్ భార్య ఐదు నెలల గర్భవతి. అతడికి ఆస్పత్రిలో సేవలు చేస్తోంది. కాగా.. శ్రీనివాస్‌ను ఆరు బయట తిప్పితే గాయాలు మానే అవకాశాలు ఉంటాయని అతడికి వైద్య సేవలు అందిస్తున్న సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ హేమంతి చెప్పారు. శ్రీనివాస్ పరిస్థితిని చూసి చలించిన ట్రైనీ స్టాఫ్ నర్స్ పి.కల్యాణి, ఎంఎన్‌ఓ ఆర్వోకే భీమేశ్వరరావు తమ సొంత ఖర్చులతో వీల్ చైర్‌ను సమకూర్చి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ చేతుల మీదుగా అందజేశారు.



ములకల్లంకలో బ్లీచింగ్ జల్లుతున్న పంచాయతీ కార్మికుడు



ములకల్లంకలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో వైద్యశిబిరం



దోసకాయలపల్లిలోని జగ్గయ్య చెరువు పొంగడంతో మునిగిపోయిన పొలాలు



జగన్నాథపురం - కాపవరం మధ్యలో చెరువులా మారిన చేలు

గోదావరి ఉగ్రరూపం

- పెరిగిన వరద ఉధృతి
- ముంపులోనే పొలాలు
- ములకల్లంకలో అధికారుల పర్యటన

సీతానగరం: గోదారమ్మ ఉగ్రరూపం దాల్చింది. వరద నీటితో పోటెత్తుతోంది. గోదావరి వరద నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముఖ్యంగా గోదావరి మధ్యలో ఉన్న ములకల్లంకపై అందరూ దృష్టి సారించారు. గోదారమ్మ పరవళ్లు తొక్కుతుండడంతో ధవళేశ్వరం ఆనకట్ట వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ములకల్లంక గ్రామంలో మంగళవారం మండల స్పెషల్ ఆఫీసర్ రామ్ ప్రసాద్, తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ డి.బాల శంకరరావు, డీఈ రవి, ఏఈ అవినాష్ పర్యటించారు. పారిశుధ్య నిర్వహణను తీరును పరిశీలించి, గ్రామస్తులతో మాట్లాడారు. గోదావరి వరద మరింత ఉధృతంగా మారడంతో బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేయడానికి అన్ని సన్నాహాలు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి రజాక్ గ్రామంలో డ్రైనేజీలను శుభ్రం చేయిస్తూ, నీరు ముందుకు తరలివెళ్లేలా చర్యలు చేపట్టారు. వీధులలో చెత్తా చెదారం లేకుండా తరలిస్తున్నారు. బ్లీచింగ్ వెదజల్లుతున్నారు. తాగునీటిని క్లోరినైజేషన్ చేయిస్తున్నారు. ములకల్లంకలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో, బొబ్బిల్లంక రేవులో వైద్యశిబిరాలు 24 గంటలూ కొనసాగుతున్నాయి. ఆ గ్రామస్తుల రాకపోకల కోసం అధికారులు బోటును ఏర్పాటు చేశారు.

గోదావరి ఎగపోటుతో పొలాల ముంపు

మధురపూడి: గోదావరి వరద ఎగపోటు కారణంగా కోరుకొండ మండలంలోని బుచ్చెంపేట, జగన్నాథపురం, బూరుగుపూడి, కాపవరం, మునగాల గ్రామాల్లోని పంట పొలాలు మునిగిపోయాయి. ఈ గ్రామాలలో 1,500 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట ముంపుబారిన పడినట్టు రైతులు చెబుతున్నారు. అలాగే దోసకాయలపల్లి, నర్సాపురం, గాదరాడ గ్రామాల్లోని వెదజల్లు సాగు చేపట్టిన రైతుల ఆశలు ఆవిరయ్యాయి.



బొబ్బిల్లంక - ములకల్లంక గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

దోసకాయలపల్లిలోని జగ్గప్ప చెరువు నిండిపోవడంతో ఆ నీరంతా పొంగిపొర్లి పొలాల్లోకి చేరింది. దీంతో దోసకాయలపల్లి - నర్సాపురం మధ్యలోని వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. ఈ ప్రాంతంలో రైతులు వెదజల్లు సాగు చేపట్టారు. అలాగే పొలలన్నీ ముంపుబారిన పడడంతో పశువులకు పచ్చిమేత కొరత ఏర్పడింది.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పెదపూడి: బాలికలు, మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ పెదపూడి సెక్టార్ సూపర్‌వైజర్ వై.శ్రీగౌరి అన్నారు. కరకుదురు, జి.మామిడాడ, పెద్దాడ, చింతపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం మిషన్ శక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగౌరీ మాట్లాడుతూ మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా 100 రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. చట్టాలపై అవగాహన ఉంటే బాలికలు, మహిళలు తమని తాము కాపాడుకోగలుగుతారన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చెప్పారు. బాలికలకు ఉన్నత విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సంపర సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ పద్మ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కరకుదురు ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రీగౌరి



సీతానగరంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు

బాల్యవివాహాలతో అనేక అనర్థాలు

సీతానగరం: బాల్యవివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని, ముఖ్యంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, మాతాశిశు మరణాలు సంభవించే అవకాశం ఉందని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సి.రాజకుమార్ అన్నారు. బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై అధికారులకు ఐసీడీఎస్ ఏసీడీపీవో పి.వరలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య పాల్గొన్నారు. డీసీపీవో రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఈ మండలంలో ఎక్కువ బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, మండల, గ్రామస్థాయి కమిటీలు చర్యలు తీసుకుని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో మాట్లాడుతూ బాల్యవివాహాల రహిత మండలంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.పెద లక్ష్మి, ఎం.వరలక్ష్మి, జి.ఇందిరా భారతి పాల్గొన్నారు.

విద్యా ప్రగతి దేశాభివృద్ధికి కొలమానం

బిక్కవోలు: విద్యా ప్రగతి దేశాభివృద్ధికి కొలమానమని కొంకుదురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పునాది అభ్యాసన, సంఖ్యా శాస్త్రంపై వివిధ కృత్యాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో భాషా నైపుణ్యం పెంచేందుకు తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో చిన్న చిన్న పదాలను వల్లె వేయించడం, విద్యార్థులకు తెలిసిన కథలను సొంత మాటలతో చెప్పించడం, పద్యాలు, పాటలు పాడించడం, గణిత పజిల్స్ ఆడించడం చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పడాల ఈశ్వరరెడ్డి, వలీషా, సుధాకర్‌రెడ్డి, చౌదరి, శిరిష తదితరులు పాల్గొన్నారు.



కొంకుదురులో గణిత పజిల్స్ ఆడుతున్న విద్యార్థులు

విద్యార్థులకు అర్థవంతంగా బోధించాలి

పెదపూడి: విద్యార్థులకు వివిధ రకాల సబ్జెక్టులు సులభతరంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని మండల విద్యాశాఖాధికారి -2 సీవీవీ సత్యనారాయణ అన్నారు. జి.మామిడాడ జెడ్పీ బాలుర, బాలికల, ఏపీత్రయం, కరకుదురు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో రెండో రోజు పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధిపై కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భాషపై మంచి పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులతో గణితంలోని ప్రాథమిక పరీక్షల ఆధారంగా వివిధ రకాల ఫజిల్స్ చేయించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జి.మామిడాడ బాలికల ఉన్నత పాఠశాలలో భాషా నైపుణ్యాలపై వివరిస్తున్న ఎంఈఓ-2 సత్యనారాయణ

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



జి.మామిడాడలో చెత్త తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి అన్నారు. మండలంలోని శహపురం, దోమాడ, జి.మామిడాడ, పెదపూడి, కరకుదురు తదితర గ్రామాల్లో జరుగుతున్న స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా జరుగుతున్న చెత్తకుప్పల తొలగింపు పనులను మంగళవారం ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజుల పాటు నిర్వహించే స్వచ్ఛతా కార్యక్రమాలతో గ్రామాలు పరిశుభ్రంగా మారాలన్నారు. అధికారులు రోజూ తప్పనిసరిగా శుభ్రత పనులు పర్యవేక్షించాలన్నారు. నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు యాళ్ల ఉమామహేశ్వరరావు, నాగేంద్ర, కృష్ణారెడ్డి, మన్యం శ్రీనివాసు చౌదరి, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా మోదకొండమ్మ జాతర



శ్రీరంగపట్నంలో బోనాలతో ప్రదర్శన చేస్తున్న మహిళలు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామ దేవత మోదకొండమ్మ జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా బోనాల ప్రదర్శన నిర్వహించారు. జాతర కోసం తరలివచ్చిన గ్రామ ఆడపడుచులతో సందడి నెలకొంది. ఈ ఉత్సవాలు ఈనెల 30వ తేదీ వరకూ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు బోనాలతో మహిళలు గ్రామంలోని ప్రదర్శన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు మద్దాల కృష్ణ, ఉపాధ్యక్షుడు సూరిశెట్టి రాముడు, కార్యదర్శి పెంటకూటి బ్రహ్మాజీ, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

రంగంపేట: వరినాట్లు వేసే రైతులంతా వ్యవసాయాధికారులు అందించే సూచనలు, సలహాలు పాటించాలని మండల వ్యవసాయాధికారి కె. శ్రీనివాసరావు కోరారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పొలాలను సందర్శించి స్థానిక రైతులతో మాట్లాడారు. వరి నాట్లు వేసే ముందు దమ్ము చక్రాలతో కాకుండా రోటావీటర్‌తో లేదా పవర్‌టిల్లర్‌తో దమ్ములు చేస్తే ఎరువులు వృథా కాకుండా మొక్కలు తీసుకుంటాయన్నారు. మురగ దమ్ములోనే భాస్వరం వేసుకోవడం వల్ల తరువాత పంట కాలంలో కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించుకోవొచ్చన్నారు. నాట్లు వేసుకునే ముందు ఒక ఎకరా పొలంలో యూరియాతో పాటు 20 కిలోల పొటాష్ వేస్తే కాండం బలపడుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



రంగంపేటలో వరి నాట్లను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరావు

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

రాజానగరం: రైతుసాధికారసంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకునేందుకు కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన రైతులు 30 మంది రైతులు రెండు బ్యాచ్‌లుగా మంగళవారం రాజానగరం మండలం నరేంద్రపురం, కలవచర్ల, కోరుకొండ మండలం నిడిగట్లలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. వారికి ఆయా క్షేత్రాలకు చెందిన రైతులు ప్రగడ రాంబాబు, అన్నపూర్ణతో పాటు ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ వల్లీ, కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) డాక్టర్ జీవీఎస్ఆర్ నాయుడు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. నరేంద్రపురానికి చెందిన ప్రగడ రాంబాబు నాలుగు ఎకరాలలో సేంద్రియ ఎరువులతో పండిస్తున్న కూరగాయలను పరిశీలించారు. కోరుకొండ మండలం నిడిగట్లలో అన్నపూర్ణ రెండు ఎకరాల మామిడి తోటలో పలు రకాల కూరగాయల సాగును, కలవచర్లలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. సేంద్రియ ఎరువులను తయారు చేసే విధానాన్ని తాతారావు, ఆయన సిబ్బంది వివరించారు.



నరేంద్రపురంలోని రాంబాబు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన రైతులు

రాగి తీగ దొంగల హల్‌చల్

- ఏడు నెలల్లో 24 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం
- ఆందోళనలో మెట్ట రైతులు

రంగంపేట: మండలంలో వ్యవసాయ బోర్ల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వరుసగా చోరీకి గురవుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకూ ఏడు నెలల కాలంలో ఏకంగా 24 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి తీగను అపహరించుకుపోయారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. తాజాగా మండలంలోని మర్రిపూడి గ్రామంలో 20 రోజుల క్రితమే రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ దొంగతనానికి గురవ్వడంతో రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ చోరీకి సంబంధించిన దర్యాప్తు కొనసాగుతుండగానే దొంగలు తాజాగా మంగళవారం మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి తీగను ఎత్తుకుపోవడం రైతుల్లో అలజడి రేపుతుంది.

రాగి వైరు కోసమే చోరీలు

మూడేళ్ల క్రితం రంగంపేట మండలంలో విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్ల చోరీలు ఎక్కువగా జరిగేవి. ఇప్పుడు ఏకంగా విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల కనెక్షన్లు కట్ చేసి మరీ రాగి తీగను తీసుకుని పైభాగంలో ఉండే ఇనుప రేకుల్ని వదిలేస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే రాగి వైరుకి మార్కెట్‌లో కనీసం రూ.10 వేలకు పైగానే లభిస్తుందని, కేవలం రాగివైరు కోసమే ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ప్రతి వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లో కనీసం 15 కేజీల రాగి తీగ ఉంటుందంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో రాగికి ఉన్న డిమాండ్ దృష్ట్యా దొంగల కన్ను ట్రాన్స్‌ఫార్మర్లపై పడింది. అయితే విద్యుత్ పనుల్లో అనుభవం ఉన్నవారే ఈ దొంగతనాలు చేస్తుండ వచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. మంగళవారం మర్రిపూడిలో జరిగిన చోరీని గమినిస్తే రైతు యార్లగడ్డ సత్యనారాయణ ఒకే సిమెంట్ దిమ్మపై రెండు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకున్నారు. అందులో రాగి వైరు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేసి ఆల్యూమినియం ట్రాన్స్‌ఫార్మర్‌ను అలాగే వదిలేశారు. ఈ ఏడాదిలో మర్రిపూడిలో 3, దొంతమూరులో 6, పెదరాయవరంలో 3, నల్లమిల్లిలో 3 ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ చోరీకి గురైంది. ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం వల్ల రైతులకు నీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా చోరీలు మాత్రం ఆగడం లేదని మెట్ట రైతులు ఆందోళన చెందుతున్నారు. రాగి వైరు దొంగలపై ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని రైతు సంఘం నాయకుడు పుట్టా సోమన్నచౌదరి, రైతులు కోరుతున్నారు.



మర్రిపూడిలో రాగివైరు చోరీ చేసి వదిలేసిన ట్రాన్స్‌ఫార్మర్ పైడొప్పలు

అక్షర తపస్వి అయ్యంకి

- అయ్యంకి వెంకటరమణయ్య కొంకుదురు వాసే
- గ్రంథాల సుగంధాలను వెదజల్లిన మహనీయుడాయన

బిక్కవోలు: ప్రతిఒక్కరూ పుస్తక పఠనం చేయాలని, ఊరూరా పుస్తకాల పరిమళాలు వెదజల్లాలని వందేళ్ల క్రితమే తెలుగునాట గ్రంథాలయోద్యమానికి శ్రీకారం చుట్టిన అక్షర తపస్వి అయ్యంకి వెంకటరమణయ్య. గ్రంథాలయోద్యమ పితామహుడిగా ప్రసిద్ధికెక్కిన అయ్యంకి వెంకటరమణయ్య బిక్కవోలు మండలం కొంకుదురులో 1890 జులై 24న జన్మించడం ఈ ప్రాంతవాసుల అదృష్టం. బుధవారం అయ్యంకి జయంతిని పురస్కరించుకుని 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది.

వందల గ్రంథాలయాల స్థాపన


అయ్యంకి వెంకటరమణయ్య తండ్రి వెంకటరత్నం నీటిపారుదల శాఖలో ఉద్యోగి. ఆయనకు చిన్నతనం నుంచి పుస్తక పఠనంపై అమితమైన మక్కువ. తాను పుస్తకాలు చదవడమే కాకుండా అందరితో పుస్తకాలు చదివించడం ఆయనకు అలవాటు. నర్సాపురంలోని టైలర్ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లోనే ఆయన స్వయంగా చిన్న గ్రంథాలయాన్ని స్థాపించి అందరినీ ఆకట్టుకున్నారు. తన 19వ ఏటనే బిపిన్ చంద్రపాల్‌ని ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవ వైపు అడుగులేశారు. 1910లో బందరులో ఆంధ్ర రాష్ట్ర సాహిత్య పత్రికను స్థాపించి గురజాడ, రాయప్రోలు, శ్రీ.శ్రీ రచనలను ప్రచురించి ప్రజలను చైతన్యపరిచారు. 1914లో ప్రథమ ఆంధ్ర రాష్ట్ర గ్రంథ బాండాగార ప్రతినిధుల మహాసభను విజయవాడలో నిర్వహించారు. అదే ఏడాది తెలుగునాట గ్రంథాలయోద్యమాన్ని వ్యాపింపజేసే లక్ష్యంతో గ్రంథాలయ సంఘాన్ని స్థాపించారు. రాష్ట్ర నలుమూలల తిరిగి గ్రంథాలయాల ఆవశ్యకతను తెలియజేస్తూ గ్రంథాలయాలను స్థాపించారు. 1919 నవంబర్ 14న చెన్నైలో తొలి అఖిల భారత పౌర గ్రంథాలయం స్థాపించి మొదటి మహాసభను నిర్వహించారు. 1924లో ఇండియన్ లైబ్రరీ జర్నల్ అనే ఆంగ్ల పత్రికను ప్రారంభించారు. ఆయన ఆ సంఘాన్ని స్థాపించిన రోజున నేషనల్ లైబ్రరీ డేగా భారత గ్రంథాలయ సంస్థ గుర్తించి దేశమంతటా 1968 నుంచి ప్రతి ఏడాది జాతీయ గ్రంథాలయ వారోత్సవమును నిర్వహిస్తుంది. 1934–1948 మధ్యకాలంలో కోస్తాంధ్ర ప్రాంతంలో వందల గ్రంథాలయాలు నెలకొల్పారాయన. ఒక్క గ్రంథాలయోద్యమమే కాకుండా వయోజన విద్య, బాల శిక్షణ, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యం వంటి రంగాల్లో ఆయన కృషి అనిర్వచనీయం.



కొంకుదురు శాఖా గ్రంథాలయం

మన కొంకుదురు వాసికి పద్మశ్రీ

అయ్యంకి వెంకట రమణయ్య చేసిన కృషికి గాను గ్రంథాలయ విశారద, గ్రంథాలయ పితామహుడు, గ్రంథాలయోద్ధారక, సరస్వతి సామ్రాజ్య ప్రతిష్ఠాపనాచార్య తదితర బిరుదులు వచ్చాయి. అంతే కాకుండా భారత ప్రభుత్వం 1972లో పద్మశ్రీ అవార్డునిచ్చి ఆయన్ని గౌరవించింది. ఆంధ్ర విశ్వ కళా పరిషత్ గ్రంథాలయ శాస్త్ర పరీక్షలో ఉత్తమ విద్యార్థికి అయ్యంకి పేరుతో ఏటా స్వర్ణ పతకం ఇస్తుంది.



అయ్యంకి వెంకటరమణయ్య(ఫైల్)

పుట్టిన ఊరులో ఆదరణ కరవు

దేశవ్యాప్తంగా పేరుగాంచిన అయ్యంకి వెంకటరమణయ్య పుట్టిన ఊరు కొంకుదురులో ఉన్న గ్రంథాలయానికి సరైన ఆదరణ లేకపోవడంతో పుస్తకాభిమానులు ఆవేదన చెందుతున్నారు. రోజువారీ వార్తా పత్రికలే తప్ప కొత్తగా అక్కడ ఎలాంటి పుస్తకాలు ఏర్పాటుచేయకపోవడం ప్రధాన లోటుగా కనిపిస్తుంది. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి కొంకుదురులో ఉన్న గ్రంథాలయాన్ని శాఖా గ్రంథాలయంగా మార్చారు. డిజిటల్ గ్రంథాలయంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినా అది కార్యరూపం దాల్చలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే పడాల సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులు గ్రంథాలయానికి బిల్డింగ్ నిర్మించి ఒక ఉద్యోగిని నియమించారు. కాని డిజిటల్ గ్రంథాలయం చేయాలన్న కల మాత్రం కలగానే ఉండిపోయింది. ఏటా ఆయన జన్మదిన వేడుకలు చేయడంతో సరిపెట్టకుండా కొంకుదురులో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేసినపుడే ఆయనకు నిజమైన నివాళి అందించినట్లని పుస్తకాభిమానులు కోరుతున్నారు.